క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల పరిశుభ్రతలోనే ఆరోగ్యం దాగుందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన స్థానిక షరీఫ్‌నగర్‌లోని యూపీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రిపోర్టులు, రికార్డులు తనిఖీ చేసి అన్ని ప్రోగ్రామ్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. చికిత్స కోసం వచ్చిన రోగులకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ప్రబలకుండా చుట్టుపక్కల పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ వారితో కలిసి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయించాలని, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు ఎత్తించాలని ఆదేశించారు.

బీసీఆర్‌పీసీ మహిళా అధ్యక్షురాలిగా చంద్రకళాబాయి



కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి మహిళా విభాగం అధ్యక్షురాలిగా నగరానికి చెందిన జె. చంద్రకళాబాయి నియమితులయ్యారు. బుధవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య నియామక పత్రం అందించి మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన, పోరాట పటిమ ఉన్న నేపథ్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన చంద్రకళాబాయిని ఉమ్మడి జిల్లాకు అధ్యక్షురాలిగా నియమించినట్లు తెలిపారు. రెండు జిల్లాలో బీసీఆర్‌పీసీ మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు త్వరలో మిగిలిన కార్యవర్గాన్ని కూడా ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే భర్తీ చేస్తామన్న సీఎం వైఎస్ జగన్ డీఎస్సీని విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, నాయకులు బాబయ్య, హుస్సేన్ బాషా, రాంబాబు, నారాయణ పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నారులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని కర్నూలు కార్మిక శాఖ సహాయాధికారి ఆర్. కేశన్న అన్నారు. బుధవారం ఆయన స్థానిక ధర్మపేటలోని తన కార్యాలయంలో షాపుల యజమానులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్ టీమ్ గెలుపు



క్రికెట్ ఆడుతున్న వైద్యుల బృందం

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు మెడికల్ కళాశాల స్పోర్ట్స్ డేలో భాగంగా బుధవారం కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోటీ జరిగింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన ప్రిన్సిపాల్ జట్టు (టీమ్-ఎ) నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఇందులో డాక్టర్ నాగార్జున 24, డాక్టర్ సునిల్ 18, డాక్టర్ సోమశేఖర్ 14 పరుగులు చేశారు. 105 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసుపత్రి సూపరింటెండెంట్ (టీమ్-బి) జట్టు 13.4 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో లక్ష్యాన్ని ఛేదించింది. ఇందులో డాక్టర్ ఇలియాస్ బాషా 39 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా డాక్టర్ హరినాథ్ 21, డాక్టర్ వెంకటేశ్వర్లు 16 పరుగులు చేశారు.



అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం



వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ (ఫైల్)



బాలవికాస్ తరగతుల్లో చిన్నారులు

సేవాభావం.. సత్యసాయి మార్గం!

- ఆధ్యాత్మిక, సామాజిక సేవలో సత్యసాయి సేవా సమితి
- దాతలు, సాయి భక్తుల సహకారంతో 40 ఏళ్లుగా కార్యక్రమాల నిర్వహణ
- ఉచితంగా యోగ, కుట్లు శిక్షణ
- బాల వికాస్ తరగతుల్లో నైతిక విలువల బోధన
- నేడు భగవాన్ సత్యసాయి 98వ జయంతి వేడుకలు



విద్యుత్‌దీపాల వెలుగులో కర్నూలు సత్యసాయి సేవా మందిరం



నగర సంకీర్తనలో సేవా దల్ సభ్యులు (ఫైల్)

కర్నూలు కల్చరల్: 'ఆకలితో అలమటిస్తున్న వారికి ఆధ్యాత్మిక ప్రబోధనలు చేయకండి.. అన్నం పెట్టండి', అనాథలకు, అభాగ్యులకు అండగా నిలబడండి అదే నిజమైన సేవ అని భగవాన్ సత్యసాయి బాబా ఉద్బోధించి ఆచరించారు. ఈయన మార్గంలోనే పయనిస్తుంది కర్నూలు నెహ్రూనగర్‌లోని సత్యసాయి సేవా సమితి. 40 ఏళ్లుగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.నేడు భగవాన్ పుట్టపర్తి సాయిబాబా 98వ జయంతి సందర్భంగా ఆ సేవా సమితి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై కథనం.

భగవాన్ సత్యసాయిబాబా స్ఫూర్తితో 1984 నవంబర్ 23న స్వామి 59వ జన్మదినోత్సవం రోజున సత్యసాయి మందిరం ప్రారంభమైంది. ఆనాటి నుంచే సత్యసాయి సేవా సమితి దాతలు, భక్తుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతుంది. ఈ సమితి సభ్యులు కరోనా సమయంలో సైతం ఏమాత్రం భయ పడకుండా కోవిడ్ పాజిటివ్‌తో హోమ్ ఐసొలేషన్‌లో ఉన్నవారికి ఆహారం అందించారు.

సత్యసాయి సేవా సమితి సేవల్లో కొన్ని..

- ప్రధానంగా అన్నార్థులకు నిత్యాన్నదాన సేవ. ఎవరూ లేని నిరు పేద వృద్ధులకు రోజు రెండు పూటలా భోజనం వండి క్యారియర్ల ద్వారా సరఫరా ఉదయం 11 గంటలకు సాయంత్రం 7 గంటలకు నగరంలోని వృద్ధులకు వారి జీవిత కాలం వరకు అన్నదాన సేవ
- ఎవరూ లేని, వంటా వార్పు చేసుకునే శక్తి ఉన్న పేద వృద్ధులకు అమృత కలశం పేరుతో ఒక మనిషికి నెలకు సరిపడా నిత్యావసర సరుకు కిట్లు అందజేత
- కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తత తీసుకొని ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- బాలవికాస్ పథకం కింద నగరంలోని టంగుటూరు ప్రకాశం పంతులు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏడేళ్లుగా ప్రతి సంవత్సరం ఒక్కో విద్యార్థికి ఏడు నోటు పుస్తకాలు అందజేత
- ప్రతి ఆదివారం బాలవికాస్ పథకం కింద విద్యార్థులకు ఆధ్యాత్మిక, నైతిక విలువలపై తరగతుల నిర్వహణ
- ప్రతి ఆదివారం నెహ్రూ నగరంలోని సత్యసాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం, హోమియో అల్లోపతి మందుల పంపిణీ
- ప్రతి మూడు నెలలకోసారి గ్రామీణ ప్రాంతాల్లో నేత్ర, దంత పరీక్షలు
- నిరుపేద మహిళలకు సీమంతాలు, కాన్పు సమయంలో మందుల పంపిణీ
- పేద మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు మిషన్ల పంపిణీ
- మహిళా విభాగం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, సీమంతాల నిర్వహణ

సేవే లక్ష్యంగా కార్యక్రమాలు



కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల పండుగలు జరుపుకోవడం సత్యసాయి సేవా సమితిలో ప్రత్యేకత. సేవా మందిరానికి అన్ని వర్గాల వారు రావచ్చు. ఎవరి నుంచి ఏమీ ఆశించకుండా సాయి భక్తుల దాతృత్వం, ఆర్థిక తోడ్పాటు, సహకారంతో నిత్యాన్నదానం, అమృత కలశం, బాలవికాస్, మహిళా వికాస్ తదితర విభాగాల ద్వారా నిరంతరాయంగా సేవలు కొనసాగిస్తున్నాం. బాబా ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాం.

–మాకా అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు,సత్య సాయి సేవా సమితి

సమితిలో 1200 మంది సభ్యులు



సేవ చేయడం భగవాన్ సత్యసాయి బాబా మాకు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాం. సేవా సమితి ద్వారా రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నాం. సుమారు 1200 మంది సభ్యులు సమితిలో ఉన్నారు. సేవా కార్యక్రమాల్లో మహిళలు కూడా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ఇతరుల సాధక బాధలు తెలుస్తాయి. సాయి సంస్థల ఆదేశాల మేరకు సేవల్లో పాల్గొంటున్నాం.

– లక్ష్మీ సరోజ, జిల్లా ఇన్‌చార్జ్, మహిళా విభాగం

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

భగవాన్ సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని గురువారం నెహ్రూనగర్‌లోని శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 5.30 గంటలకు ఓంకారం, సుప్రభాతం, 6 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు అష్టోత్తర పూజ, పతాకావిష్కరణ, భజన, 7.30 గంటలకు సత్యసాయి బాబా వారికి రుద్రాభిషేకం, భజన, మంగళహారతి, సాయంత్రం 5.30 గంటలకు వేద పఠనం, 6 గంటలకు భజన, 7 గంటలకు ఝూల ఉత్సవం, స్వామి సందేశం, మహా మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి.

నిమోనియా సోకకుండా ఉచితంగా వ్యాక్సిన్



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు నిమోనియా వ్యాధి సోకకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన వ్యాక్సిన్ అందజేస్తోందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత చెప్పారు. బుధవారం ఆమె స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిమోనియా సోకితే శ్వాస తీసుకోవడానికి కష్టంగా ఉంటుందన్నారు. జబ్బు ఉన్న వారు తుమ్మినట్లయితే గాలి ద్వారా బ్యాక్టీరియా వేరొకరికి అంటుకునే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న ఐదేళ్లలోపు పిల్లలు, 65 సంవత్సరాలు దాటిన వారికి జబ్బు సోకే అవకాశం ఉందన్నారు. ఈ జబ్బు సోకితే దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, దగ్గితే గళ్ల పడటం, చర్మం నీలి రంగులోకి మారడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రోగులు దగ్గినప్పుడు చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలని సూచించారు. నిమోనియా రాకుండా ఉండేందుకు పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని తెలిపారు. వ్యాధినిరోధక టీకాలు వేయించాలని, తరచూ చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని చెప్పారు.బరువు తక్కువ పిల్లలను వైద్యుల సూచన మేరకు స్నానం చేయించాలని, శిశువులకు చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషం

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- 250 రోజులకు చేరిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ఎన్నికల్లో గెలిచిన తరువాత మొదటి ఏడాదిలోనే సంక్షేమ పథకాలను అమలు చేయడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని గార్గేయపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ గ్రామంలో ఏడు రోజుల పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద స్థానిక నాయకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధిపొందిన వివరాలతో కూడి బుక్‌లెట్లను అందజేసి వివరించారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. అనివార్య కారణాల వల్ల ఎవరైన పథకాలను అందుకోలేని వారితో మరోసారి దరఖాస్తు చేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

సమస్యలు పరిష్కారానికే గడప గడపకు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీఎం ఎమ్మెల్యేలను ప్రజల దగ్గరకు గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో పంపిస్తున్నారని, నియోజకవర్గంలో 250 రోజులు ఈ కార్యక్రమం పూర్తి చేశామన్నారు. సి.బెళగల్ మండలంలోని పోలకల్లు, రంగాపురం, కోడుమూరు మండలంలోని లద్దగిరి, కర్నూలు మండలంలోని రేమట సగం గ్రామం మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని సుమారు 87 వేల కుటుంబాలలో ఓ పది వేల గృహాలు మినహా ప్రతి గృహాన్ని సందర్శించానన్నారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో కొన్ని సమస్యలను మా దృష్టికి తెచ్చారని, వీలైనంత తొందరగానే వాటిని పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ సెంటర్‌ను, జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పిల్లలకు పెట్టే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, గ్రామ నాయకులు శేఖర్, శీను, అనిల్, మూలింటి రత్న స్వామి, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలి

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులు కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా సిల్వర్‌జూబ్లీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ పని చేస్తున్నారన్నారు. రెండు కాలేజీలు పర్యవేక్షణ చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. కాలేజీని సందర్శించిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంటి, మునిస్వామి, శివరాజ్, శేఖర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ములాయంకు నివాళి

కర్నూలు(అర్బన్): సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ బహుజనుల కోసం ఎంతో శ్రమించారని ఆ పార్టీ నేతలు అన్నారు. బుధవారం ములాయం జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ రాయలసీమ కో-ఆర్డినేటర్ పాండురంగయాదవ్, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, పెరుగు శివకృష్ణయాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్న యాదవ్, దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: నగరంలోని ప్రభుత్వ అత్యున్నత విద్యా అధ్యయన సంస్థ(ఐఏఎస్ఈ–ప్రభుత్వ బీఈడీ కాలేజ్)లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఆర్ ఆదినారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, సోషల్ సైన్సెస్, గణితం, సైకాలజీ సబ్జెక్టులు బోధించేందుకు ఎంఎడ్‌తో పాటు, సంబంధిత సబ్జెక్టులలో పీజీ 55 శాతానికిపైగా మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

- వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ



మాట్లాడుతున్న నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ అన్నారు. బుధవారం స్థానిక 25వ వార్డు 64వ సచివాలయ పరిధిలో రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఉండేది కాదని, జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే అందేవన్నారు. ముఖ్యంగా 2014 ఎన్నికల ముందు టీడీపీ నేత చంద్రబాబు 600 హామీలు ఇచ్చి.. అన్ని వర్గాలకు మోసం చేశారని చెప్పారు. రుణ మాఫీ పేరుతో పొదుపు మహిళలు, ఇంటికో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన ఘనత బాబుకే దక్కుతుందని చెప్పారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి రాగానే అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో సారి ఆయనను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం పార్టీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్ మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని, ఇలాంటి నాయకుడు మరో 30 ఏళ్లు సీఎంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేదార్ నాథ్, శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథం

- మారిపోతున్న కల్లూరు అర్బన్ వార్డుల రూపురేఖలు
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- 21వ వార్డులో రూ.5 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పార్థసారథి నగర్‌లో నిర్మించిన డ్రైనేజీ



ఎన్‌జీఓ కాలనీలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

కల్లూరు: చాలా ఏళ్ల తర్వాత కల్లూరు అర్బన్ వార్డులు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి మహర్దశ వచ్చింది. గత ప్రభుత్వాలు ఓటమి భయంతో నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో నగర ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. కనీస మౌలిక సదుపాయాలకు సైతం నోచుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అన్ని స్థానిక సంస్థలకు, నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది. కర్నూలు నగరంలో నూతన పాలక వర్గం వచ్చాక వార్డుల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.

ప్రాధాన్యతలను అనుసరించి పనులు: కర్నూలు నగర పాలక సంస్థలో మొత్తం 52 వార్డులు ఉన్నాయి. ఇందుల్లో 16 వార్డులో పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. ఈ పరిధిలోని వార్డులు రోజు రోజుకు విస్తరిస్తుండడంతో ప్రాధాన్యతలను బట్టి మౌలిక వసతులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21వ వార్డులో రూ. 5 కోట్లతో పనులు

కల్లూరు అర్బన్ పరిధిలోని 21వ వార్డులో సుమారు రూ. 5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మొత్తం రూ. 80లక్షలతో ఎన్‌జీఓ కాలనీలో గ్రావెల్ రోడ్లు వేశారు. డాక్టర్స్ కాలనీ సంస్కృతి పార్కును రూ. 2 కోట్లతో అభివృద్ధి చేశారు. దీంతో ఆయా కాలనీ వాసులు సంతోషంగా పార్కులో సమయం గడపుతున్నారు. మహాలక్ష్మి నగర్‌లో రూ. 35 లక్షలతో డ్రైనేజీ, పరమేశ్వర నగరలో రూ. 30లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు. ఎఫ్‌సీఐ–2 కాలనీలో రూ. 70 లక్షలతో డిస్పోజల్ డ్రైనేజీ కాలువ, పార్థసారథి నగర్‌లో రూ. 60లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువలు, ఎన్‌జీవో కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40లక్షలు, జనరల్ ఫండ్ రూ. 40 లక్షలతో కాలువలు ఏర్పాటు చేశారు. ఎఫ్‌సీఐ–1 కాలనీలో రూ.50 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేశారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకరంతో వార్డులోని పలు కాలనీల్లో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నాం. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాం. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 80లక్షలతో పాటు మున్సిపల్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, పార్కు అభివృద్ధి చేశాం.

– అరుణ, 21వ వార్డు కార్పొరేటర్

మురుగు సమస్య తీరింది



మేము 14 సంవత్సరాలుగా పార్థసారథి నగర్‌లో నివాసం ఉంటున్నాము. కాలనీలో డ్రైనేజీ కాలువ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఇంటి ముందు మురుగు నిలిచేది. నడిచేందుకు వీలుండేది కాదు. దీనికితోడు పందుల బెడద. ప్రస్తుతం మా కాలనీలో కాలువలు నిర్మించడంతో మురుగు నీటి సమస్య తీరింది.

– కె.సరస్వతి, పార్థసారథి నగర్

పోలింగ్ కేంద్రాలు పరిశీలించి నివేదిక ఇవ్వండి

- పాణ్యం నియోజకవర్గ సెక్టోరియల్ ఆఫీసర్లకు జేసీ ఆదేశం



సెక్టోరల్ ఆఫీసర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి డిసెంబర్ 30 తేదీలోపు ప్రతిపోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి భద్రతరమైన చర్యలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక ఇవ్వాలని ఆ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి సెక్టోరియల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోలింగ్ స్టేషన్లను పరిశీలించే సమయంలో పోలింగ్ స్టేషన్‌కు 2 కిలోమీటర్ల దూరంలోనే ఓటర్లు ఉండి ఓటు వేయడానికి అనువుగా పరిస్థితులు ఉన్నాయో లేవో గమనించాలన్నారు. వికలాంగుల కోసం ర్యాంపు సౌకర్యం ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. డిసెంబర్ 30 లోపు పోలింగ్ స్టేషన్లను ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్ ఆఫీసర్లు, పోలీసుల సంయుక్తంగా మూడుసార్లు పరిశీలించి తుది నివేదికను తనకు సమర్పించి అందులో సమస్యాత్మక కేంద్రాలు ఉంటే వివరాలు తెలపాలన్నారు.

మిగిలిన నూతన ఓటర్లను నమోదు చేయించండి

పాణ్యం నియోజకవర్గంలో మిగిలిపోయిన నూతన ఓటర్ల వివరాలను నమోదు చేయించేందుకు సహకారం అందించాలని జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై ముసాయిదా ఓటరు జాబితాపై సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని, ముసాయిదా జాబితాలో ఓటర్ల తొలగింపు, చేర్పులకు సహకారం అందించాలన్నారు. గడివేముల మండలం కరిమద్దల, కల్లూరు మండలం చెన్నమ్మ సర్కిల్‌లో ఉన్న పోలింగ్ స్టేషన్లను దారుల ఇబ్బంది దృష్ట్యా మరో ప్రాంతానికి తరలించాలని రాజకీయపార్టీల ప్రతినిధులు కోరడంతో చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సుధాకర్, అనుమంతరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.